క్లుప్తంగా

పీవీకే మైన్ మేనేజర్‌కు స్వాగతం

సింగరేణి(కొత్తగూడెం): ఏరియా పీవీకే–5 ఇంక్లైన్ గనికి కార్పొరేట్ నుంచి బదిలీపై వచ్చిన నూతన మేనేజర్ శ్యాంప్రసాద్‌కు శుక్రవారం ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ అధ్వర్యంలో సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీ, క్యాంటిన్ కమిటీ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ఆర్టీసీ బస్సు సర్వీస్ నడిపించాలి

పాల్వంచరూరల్: మారుమూల గ్రామైన దంతలబోరు గ్రామానికి ఆర్టీసీ బస్సులను నడపకపోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గద్దల రమేష్ అన్నారు. ఈ మేరకు కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులు అనేక ఇబ్బందులు, పడుతున్నారని, ఉచిత బస్సు సౌకర్యం గ్రామీణ ప్రాంత మహిళలు పొందలేకపోతున్నారని వివరించారు. నాగారం, నారాయణరావుపేట, సంగం, దంతలబోరు ఎస్సీకాలనీ, దంతలబోరు, బంధ్రుగొండ, గంగాదేవిగుప్ప గ్రామాలకు బస్సును నడిపించాలని కోరారు.

తీజ్ వేడుకలకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కమిటీ సభ్యులు

టేకులపల్లి: ఈనెల 18న బంజారాల తీజ్ వేడుకలు ముగింపు కార్యక్రమానికి సతీసమేతంగా హాజరు కావాలని కోరుతూ ఉత్సవ కమిటీ నాయకులు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను కోరారు. ఈ మేరకు శుక్రవారం కోయగూడెంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ధరావత్ ప్రేమ్‌చంద్ నాయక్, బోడ మంగీలాల్ నాయక్, బానోతు సక్రునాయక్, భూక్యా కిషోర్‌సింగ్, నాగేష్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు గర్హనీయం..

ఇల్లెందు: బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై మాజీ మంత్రి కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు తగదని పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గాడిపల్లి స్వరూప అన్నారు. శుక్రవారం ఇల్లెందులో మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సులలో కుట్లు, అల్లికలే కాదు మహిళలు రికార్డింగ్ డ్యాన్సులు, బ్రేక్ డ్యాన్సులు కూడా చేసుకోవచ్చంటూ కేటీఆర్ అవహేళనగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళల పట్ల అభ్యంతరకరంగా వ్యాఖ్యలు చేయటాన్ని మానుకోవాలని కోరారు.

దోషులను శిక్షించాలి

ఇల్లెందు: కలకత్తా వైద్యవిద్యార్థినిపై సామూహిక అత్యాచారం సంఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని మాస్‌లైన్ అనుబంధ పీఓడబ్ల్యూ డిమాండ్ చేసింది. శుక్రవారం ఇల్లెందు మాస్‌లైన్ కార్యాలయం నుంచి భగత్ సింగ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అత్యాచారం భూతం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు నాయిని రాజు, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ, పీవైఎల్ రాష్ట్ర నాయకులు వాంకుడోతు అజయ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ మాట్లాడుతూ.. కలకత్తాలో వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారం చేసిన సంఘటన యావత్ సభ్య సమాజం తలవంపుగా మారిందన్నారు. మహిళకలు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బుర్ర వెంకన్న, అజ్మీర బిచ్చా, యదళ్లపల్లి సావిత్రి, రేసు సరిత, వెంకటమ్మ, కోటయ్య, రాఘవులు, నరేందర్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మేదరబస్తీలోని శ్రీ రాగా స్కూల్‌లో ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ రిలయన్స్, ముత్తూట్ ఫిన్ కార్ప్ వారు ఇండిపెండెన్స్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోటీల్లో శ్రీ రాగా విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ మల్లారపు వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. పోటీలలో బెస్ట్ స్కూల్ - 2024 బహుమతితో పాటు మొదటి 10 స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి, బంగారు పతకాలు, సర్టిఫికెట్లు అందుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

మక్క దిగుబడి ప్రశ్నార్థకం?

- అతివృష్టి, అనావృష్టితో సమస్యాత్మకంగా సాగు
- నీటి వసతి లేక వడలిపోతున్న పంట
- ఆందోళనలో రైతులు



కొమరారంలో వడలిపోతున్న మొక్కజొన్న తోట

ఇల్లెందురూరల్: సరైన నీటి వనరులు లేకపోవడంతో ఇల్లెందు ఏజెన్సీ రైతు వరణుడి కరుణపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తుంటారు. ఈ ఏడాది కూడా వరణుడు దోబూచులాడంతో ఆరుగాలం కష్టపడి రైతులు సాగుచేసిన పంటలు చేతికి వచ్చేటట్లు కనిపించడం లేదు. వర్షాకాలం ప్రారంభంలోనే సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కోగా పక్షం రోజుల క్రితం ఏకధాటిగా కురిసిన వర్షం అన్నదాతను అతలాకుతలం చేసింది. దీనికితోడు పది రోజులుగా వేసవిని తలపించేలా భానుడు తన ప్రతాపం చూపడంతో మొక్కజొన్న పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

అతివృష్టి, అనావృష్టి...

ఈ ఏడాది సీజన్ ప్రారంభంలో ఆశించిన మేర వర్షాలు కురవడంతో అన్నదాతలు ప్రధానంగా మొక్కజొన్న విరివిగా సాగు చేశారు. కానీ రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లుగా వరణుడి జాడలేక వేసిన విత్తనం మొలకెత్తకపోవడంతో రైతు నీరసించాడు. చివరికి వరణుడు కరుణ చూపడంతో అత్యధిక సంఖ్యలో రైతులు రెండోసారి విత్తనాలు వేసుకున్నారు. అడపాదడపా వర్షాలు కురవడంతో పంటలు ఏపుగా పెరుగుతున్నాయని రైతులు దిగుబడిపై ఆశలు పెట్టుకున్నారు. ఆ వెంటనే ఏకధాటిగా పక్షం రోజులు కురిసిన వర్షానికి చేలల్లో నీరు నిలిచి మొక్కల ఎదుగుదలపై ప్రభావం చూపింది. తాజాగా పది రోజులుగా భానుడు తన ప్రతాపం చూపడంతో ప్రధానంగా మొక్కజొన్న పంట వడలిపోతోంది. బోర్లు, బావుల కింద కొంత విస్తీర్ణంలో పంటలను రక్షించుకుంటున్నప్పటికీ ఆకాశపాయపై ఆధారపడుతున్న రైతులు ఆశగా వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు.

చీడపీడలతో..

రెండేళ్ల క్రితం మొక్కజొన్న రైతును అతలాకులం చేసిన కత్తెర పురుగు మళ్లీ ఇల్లెందు ఏజెన్సీలోకి ప్రవేశించడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పురుగు మందులు పిచికారీ చేసి కొంతమేర కత్తెర పురుగును నియంత్రణ చేయగలిగారు. కానీ ఈ కారణంగా పెట్టుబడి వ్యయాన్ని మాత్రం పెంచుకోక తప్పలేదు. ఇంతేకాకుండా భారీ వర్షాలతో చాలాచోట్ల మొక్కజొన్నకు విల్ట్ రోగం ఆశించింది. దీని నివారణకు పురుగు మందులు పిచికారీ చేసినా ఎటువంటి ఫలితం కనిపించడం లేదు. ఈ రోగం కారణంగా మొక్క ఎదగకుండా అలాగే ఉండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

దిగుబడిపై తీవ్ర ప్రభావం..

ప్రస్తుతం మొక్కజొన్న అధిక విస్తీర్ణంలో కంకిదశకు చేరుకుంది. మరికొంత విస్తీర్ణంలో కంకిపోసుకునే దశకు చేరుకుంది. ఈ దశలో మొక్కకు నీరు అధికంగా అవసరం. ఈ సమయంలో నీరు అందకపోతే కంకి ఎదుగుదల లేకపోవడం, గింజల సంఖ్య తగ్గిపోవడం, తాలు గింజలు తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతుండడంతో మొక్కజొన్న చేలు నిలువునా ఎండిపోతున్నాయి. మెట్టపంటలు, గుట్టలపై సాగు చేస్తున్న పంటలు ఇప్పటికే పూర్తిగా వడలిపోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా ఇబ్బందిపడుతుండగా నీటివనరు సాధ్యం కాని రైతులు వరణుడినే ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు.

మండలంలో పదివేల ఎకరాల్లో..

ఇల్లెందు ఏజెన్సీలో వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం 25వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగవుతోంది. ఐటీడీఏ సహకారంతో బోర్లు, బావులు వేసుకున్న రైతులు వరణుడు ముఖం చాటేసిన సమయంలో వాటి సహాయంతో పంటలను సాగు చేస్తున్నారు. మిగతా విస్తీర్ణంలో వరణుడు కరుణిస్తేనే పంటలు సాగయ్యే పరిస్థితి ఉంటుంది. ఇలా సుమారుగా పదివేల ఎకరాల విస్తీర్ణంలో పంటలు వడలిపోయే దశకు చేరుకున్నాయి. రెండు, మూడు రోజుల్లో వర్షం కురిస్తేనే పంటలు చేదికందే పరిస్థితి ఉంటుంది. ఆ తరువాత వర్షం కురిసినా దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు వాపోతున్నారు.

విత్తు దశ నుంచే..



ప్రస్తుత సీజన్‌లో మొక్కజొన్న సాగు సమస్యగా మారింది. ప్రారంభంలో వర్షాలు సహకరించక రెండోసారి విత్తనాలు విత్తుకున్నాం. ఆ తరువాత కత్తెర పురుగు ఇబ్బంది పెట్టింది. ఏకధాటి వర్షాలు చీడపీడల బారిన పడేశాయి. తాజాగా వర్షాభావంతో పంటలు ఎండిపోతున్నాయి.

– బానోత్ కోబర్, రైతు, లక్ష్మీనారాయణతండా

దిగుబడిపై ప్రభావం



ప్రస్తుతం మొక్కజొన్న కంకి దశకు చేరుకుంది. ఈ దశలో మొక్కకు నీరు అధిక మోతాదులో అవసరం. కానీ వర్షాలు లేక మొక్కలు నిలువునా ఎండిపోతున్నాయి. వెంటనే వర్షాలు కురిస్తేనే పంటలు తేరుకుంటాయి. ఆ తరువాత కురిసినా ఆశించిన ఫలితం ఉండదు.

– బానోత్ సంతు, రైతు, బోయితండా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాల్వంచరూరల్: బస్వతారక కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా హమాలీ కాలనీ, కాంట్రాక్ట్ కాలనీ, వికలాంగుల కాలనీ, జయమ్మ కాలనీ, బాపూజీ నగర్, వేంకటేశ్వర హిల్స్ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జూలూరుపాడు: పడమటనర్సాపురం, పాపకొల్లు (అన్నారుపాడు), జూలూరుపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జూలూరుపాడు విద్యుత్‌శాఖ ఏఈ సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1వరకు సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

ఇల్లెందురూరల్: చల్లసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రవి తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ.. చల్లసముద్రం, ధనియాలపాడు, కట్టుగూడెం, రేపల్లెవాడ ఫీడర్లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఇంకుడుగుంతల నిర్మాణాలు పూర్తిచేయండి



తోగ్గూడెంలో ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాల్వంచరూరల్: ఇళ్లల్లో ఇంకుడుగుంతల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి అన్నారు. మండలంలోని తోగ్గూడెం గ్రామపంచాయతీలో ఇంకుడుగుంతల నిర్మాణ పనులను శుక్రవారం ఎంపీడీఓ పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ.. పంచాయతీలో ఇంకుడు గుంతలు నిర్మాణం చేసుకొని ప్రజలకు అవగాహన కల్పించి నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ రంగా, కార్యదర్శి రవికుమార్ ఉన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి..




మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: సామాన్య ప్రజలు చిన్న పొరపాటు చేస్తే సవాలక్ష నిబంధనలతో వేధించే అధికారులు, బడాబాబులు ఎంత పెద్ద తప్పు చేసినా పట్టించుకోవడం లేదని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ మండిపడ్డారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కొత్తగూడెం బస్టాండ్ సమీపంలో బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టారని, దీనికి దరఖాస్తులో కేవలం 176 గజాలకు మాత్రమే అనుమతి తీసుకుని 475 గజాల్లో నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. జాతీయ రహదారికి పక్కనే ఉండడంతో డ్రెయినేజీకి 20 అడుగులు (6మీటర్లు), బిల్డింగ్ మూడు వైపులా 7 అడుగులు (2మీటర్లు) సెట్ బ్యాక్‌తో నిర్మాణం చేయాలనే నిబంధన పాటించలేదని ఆరోపించారు. రాజకీయ పలుకుబడి ఉపయోగించి అక్రమ సెల్లార్ నిర్మాణం జరుగుతోందని, ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అధికారులు తూతూ మంత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధి కుమ్మక్కై అక్రమ నిర్మాణానికి సహకరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో గంధం మల్లికార్జున్‌రావు, వంగా రవిశంకర్, తడికమళ్ల దిలీప్, నవతన్, మురళీ తదితరుల పాల్గొన్నారు.

ఆల్ ఇండియా కోటాను సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: నీట్– 2024లో అర్హత సాధించిన విద్యార్థులు అల్ ఇండియా కోటాలో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, ఆల్ ఇండియా కోటాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ వ్యాప్తంగా యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, ఈఎస్ఐసీ కళాశాలలతో పాటు, వివిధ రాష్ట్రాలలోని మెడికల్ కాలేజీలలో అల్ ఇండియా కోటాలో 15 శాతం సీట్లను, మూడు రౌండ్లలో భర్తీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 20 తేదీ లోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

'కూలి భరోసా' ఇవ్వాలి



మాట్లాడుతున్న కాంతయ్య

పాల్వంచ: కూలి భరోసా పథకం ఏర్పాటు చేయాలనీ బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కలకోట కాంతయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీఆర్ భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం వీసంశెట్టి పూర్ణచందర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. మాట్లాడుతూ.. కూలి భరోసా పథకం ఏర్పాటు చేసి వ్యవసాయ కార్మికులకు ప్రతీనెల రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీల సంక్షేమం పాలకులకు పట్టడం లేదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద పల్లెల్లో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలకు రోజుకు రూ.500 వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. తాటి వెంకటేశ్వర్లు, ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, కల్లూరి వెంకటేశ్వర్లు, రేసు ఎల్లయ్య, సలీం, సీతారాంరెడ్డి, రాంచందర్, బండి నాగేశ్వరరావు, పేరాల శ్రీనివాస్, గోవింద్, నారాయణ, రామకృష్ణ, పద్మ, కేశవులు, దారా శ్రీనివాస్, బిక్కులాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై పనిభారం తగ్గించండి



మాట్లాడుతున్న యాకుబ్‌షావలీ

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పనిభారం తగ్గించాలని మాస్‌లైన్ అనుబంధ ఇఫ్టూ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆస్పత్రిలో కాంట్రాక్ట్ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేషెంట్ కేర్, స్వీపర్స్, సెక్యూరిటీ గార్డులు, ఎక్స్‌రే విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు పనిభారంతో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు.

పదిమంది పని చేయాల్సిన స్వీపర్ల స్థానంలో నలుగురు పని చేస్తున్నారని, వేతనాలు కూడా సక్రమంగా అందటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పాయం వెంకన్న, మల్లెల వెంకటేశ్వర్లు, ఉమా, కృష్ణవేణి, వెంకటమ్మ, సుజాత, లక్ష్మి, రాము, రవి, పవన్, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

జీవితాంతం ప్రజా సేవలోనే..



కొత్వాలను సన్మానిస్తున్న నాయకులు

పాల్వంచ/పాల్వంచరూరల్: తాను జీవితాంతం ప్రజా సేవలోనే ఉంటానని మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాత పాల్వంచలో శుక్రవారం ఆయన జన్మదిన వేడుకలు జరగగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొత్వాల మాట్లాడారు. తరువాత పెద్దమ్మతల్లి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. డీసీసీబీ మేనేజర్ స్వప్న, ఫైర్ ఆఫీసర్ క్రాంతి, జెడ్పీ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషాతో పాటు యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, నూకల రంగారావు, కాంపెల్లి కనకేష్, గంధం నర్సింహారావు, బండ్లపల్లి వెంకటనారాయణ, గంధం సతీష్, వెంగళరావు, రాంరెడ్డి, బ్రహ్మచారి, బాలాజీనాయక్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు గడువు ఇవ్వండి..

సింగరేణి(కొత్తగూడెం): తాము ఇళ్లు పూర్తిగా కట్టుకునేంత వరకు గడువు ఇవ్వాలని ఎస్ఆర్‌టీ వాసులు సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని వీకే–7 ఓపెన్ కాస్ట్ గని విస్తరణలో భాగంగా ఎస్ఆర్‌టీ కాలనీ వాసులకు సింగరేణి యాజమాన్యం కొత్తగూడెంలోని ఎక్స్‌ప్లోరేషన్ వద్ద ప్లాట్లను ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఇచ్చింది. స్థలాలు ఇచ్చినప్పటికీ క్వార్టర్లు ఖాళీ చేయటం లేదని, శుక్రవారం ఏరియా అధికారులు సెక్యూరిటీ సిబ్బంది కాలనీవాసులను క్వార్టర్లు ఖాళీ చేసి వెళ్లాలని కోరారు. ఇందుకు బాధితులు ఇళ్లు కట్టుకునేంత వరకు గడువు ఇవ్వాలని కోరారు. అధికారులకు కాలనీవాసుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో తాము ఈ విషయమై కలెక్టర్ కలుస్తామని చెప్పడంతో అధికారులు వెనుతిరిగారు. ఈ కార్యక్రమంలో జీకే ఓసీ పీఓ శ్రీరమేష్, ఎస్టేట్స్ అధికారులు తావుర్యా, మధుకరు, సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు.

వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలి



వైద్యులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, వైద్యాధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని పీవైఎల్ పాల్వంచ డివిజన్ నాయకురాలు వగ్గెల పద్మ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్యులకు వినతిపత్రం అందించారు. పద్మ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో వైద్య పరీక్షలు పెంచాలని, పరికరాలు, మందులు సరిపడా అందుబాటులో ఉంచాలన్నారు. వైద్య సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఇదే అదునుగా భావించి ప్రైవేట్ ఆస్పత్రులు సంబంధం లేని వైద్య, రక్త పరీక్షలు, మందులు అంటగడుతూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని వాపోయారు. పట్టణాల్లో, గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నీలం భాస్కర్, తాటి నాగరాజు, రాయబారపు కరుణ, జి.వెంకటేశ్వర్లు, వెంకట మహాలక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

908 మంది రైతులకు రుణమాఫీ



మాట్లాడుతున్న వీరహన్మంతరావు

చుంచుపల్లి: కొత్తగూడెం సొసైటీ పరిధిలోని 908 మంది రైతులకు రూ.3.24 కోట్ల మేర రుణమాఫీ వచ్చిందని సొసైటీ అధ్యక్షుడు మండె వీరహన్మంతరావు తెలిపారు. శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కొత్తగూడెం కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సొసైటీలోని రైతులకు రుణమాఫీ చేసినందుకు ఆనందంగా ఉన్నారని కార్యవర్గ సభ్యులందరు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటి ఉపాధ్యక్షుడు కూచిపూడి జగన్నాథరావు, సొసైటీ డైరెక్టర్లు వేల్పుల మల్లేష్, బండి అమృతరావు, గుగులోతు చందర్, కర్నాటకపు రాంచందర్ రావు, తీట్ల విజయకుమారి, పోటు వెంకటేశ్వరరావు, గుగులోతు విజయ, కంటేం సత్యనారాయణ, సంఘ సెక్రటరి పండ్ల సారయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం ఇచ్చిన హామీలు అమలు చేయండి..



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన అనేక వాగ్దానాలు, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ఈనెల 22న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కెచ్చెర్ల రంగయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రావటానికి అనేక హామీలు ఇచ్చిందని, కొత్తరేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు తదితర అనేక సమస్యల పరిష్కారం కోసం పేదప్రజలు సంవత్సరాల తరబడి ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముద్దా భిక్షం, జాతోట్ కృష్ణ, బానోత్ ధర్మ, వై.గోపాలరావు, కల్లూరి కిశోర్, పెద్దబోయిన సతీస్, రామ్‌చందర్, కల్లూరి పద్మ, రాజశేఖర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రల సమ్మె నోటీసు



డాక్టర్ వెంకటేశ్వర్లుకు సమ్మె నోటీసు అందజేస్తున్న ఆరోగ్యమిత్రలు

జూలూరుపాడు: సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం జూలూరుపాడు పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేశ్వర్లుకు ఆరోగ్యమిత్రలు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య మిత్రలు ఎన్వీ రాధాకృష్ణ, డి.నరసింహారావు మాట్లాడుతూ.. 17 ఏళ్లుగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పని చేస్తున్నామన్నారు. ఆరోగ్యమిత్రలకు డేటా ప్రాసెసింగ్ క్యాడర్ కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించాలని ఆరు నెలల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కలకు వినతిపత్రం ఇచ్చినా స్పందించకపోవడంతో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. 14 రోజులు లోపు సమస్య పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని చెప్పామని, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 20 తరువాత సమ్మెకు వెళ్లేందుకు తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నిర్ణయించడంతో ముందుస్తుగా సమ్మె నోటీసు ఇచ్చినట్లు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

మహిళలకు అత్యంత ఇష్టమైన పండుగల్లో వరలక్ష్మీ వ్రతం ముఖ్యమైంది. శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో, ఇళ్లల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కలశస్థాపన, గణపతి పూజ చేసి మహాలక్ష్మి ప్రతిమను పంచామృతాలతో అభిషేకించారు. బెల్లం, నెయ్యితో తయారు చేసిన నైవేద్యాలను అమ్మవారికి నివేదించారు. బంధువులు, ఇరుగుపొరుగు మహిళలకు తమలపాకు, అరటిపండ్లు, నానబెట్టిన శనగలు, వక్కపొడి, బియ్యం పిండితో తయారు చేసిన ప్రసాదాన్ని వాయినంగా ఇచ్చిపుచ్చుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంటౌన్: అమ్మవారిని పూజిస్తున్న భక్తులు







టేకులపల్లిలో, ఇల్లెందురూరల్: జగదాంబగుంపులో, సుభాష్‌నగర్‌లో, కొత్తగూడెంఅర్బన్: వాయినం అప్పగింత, జూలూరుపాడు: వేణుగోపాల స్వామి ఆలయంలో..